సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 24 । ఏప్రిల్ । 2025



మూలపల్లెలో చిరుతల సంచారం

సిద్దవటం మండలంలోని మూలపల్లె గ్రామంలో చిరుతలు సంచరిస్తుంటడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

-4లో



ఉగ్రదాడి పిరికిపంద చర్య

జమ్మూకశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిని పిరికిపంద చర్య అని వైఎస్సార్ సీపీ శ్రేణులు పేర్కొన్నాయి.

-4లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 450 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసులు



రాజంపేట: రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా జీ.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గూడూరు, గుత్తి, పెనుగొండ మున్సిపాలిటి కమిషనర్‌గా పనిచేశారు. కొత్తగా వచ్చిన కమిషనర్‌ను సిబ్బంది పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో రాజంపేట పట్టణాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సమస్యలు ఏవైనా తన దృష్టికి తీసుకువస్తే శాఖపరంగా పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

పులివెందుల వాసికి సంగీతంలో గిన్నిస్ బుక్ రికార్డ్

పులివెందుల రూరల్: పులివెందుల పట్టణంలోని రాజీవ్ కాలనీలో నివాసముంటున్న దిద్దెకుంట రాజేష్ కుమార్ సంగీతంలో గిన్నిస్ బుక్ రికార్డు సొంతం చేసుకున్నారు. విజయవాడలోని హలెల్ మ్యూజిక్ స్కూల్ ఆన్‌లైన్ క్లాస్ ద్వారా సంగీతం నేర్చుకున్న ఈయన 2024 డిసెంబర్ 1వ తేదీన 18 దేశాలలోని 1046 మంది స్వరాలు ఆలపించి ఈ రికార్డును సొంతం చేసుకున్నారు.

శభాష్.. కీర్తిరెడ్డి



తల్లిదండ్రులతో కీర్తిరెడ్డి

కడప ఎడ్యుకేషన్: సాధించాలనే కృషి, పట్టుదలతో పాటు తన భర్త ప్రోత్సాహంతో కడప నగరానికి చెందిన కె. శ్రీనివాస కీర్తిరెడ్డి సివిల్స్ ఫలితాల్లో 316 ర్యాంకు సాధించింది. శ్రీనివాస కీర్తిరెడ్డి భర్త ఎంపాటి శ్రీసాయి ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్‌లో భాగంగా విజయవాడలోని ఆల్ ఇండియా రేడియోలో న్యూస్ ఏపీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. కాగా భర్త ప్రోత్సాహంతో పాటు ఆయన గైడెన్స్‌తో కీర్తిరెడ్డి సివిల్స్‌కు ఇంటి వద్దే నుంచే సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 316వ ర్యాంకు సాధించింది. కీర్తిరెడ్డి తండ్రి కేవీ చలమారెడ్డి కడపలోని ఎల్ఐసీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చెందారు. తల్లి శ్రీకృష్ణ ఎల్ఐసీలో హైయర్ గ్రేడ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా వీరిలో పెద్దకుమార్తె శ్రీనివాస కీర్తిరెడ్డి ప్రస్తుతం సివిల్స్‌లో 316వ ర్యాంకు సాధించగా రెండవ కుమార్తె శ్రీయ డిగ్రీ పూర్తి చేసింది. కీర్తిరెడ్డి ప్రాథమిక విద్య రాజంపేటలోని నలంద హైస్కూల్లో పూర్తి చేయగా ఇంటర్మీడియట్‌ను హైదరాబాదులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో పూర్తి చేసి ఇంజినీరింగ్‌ను రాజస్తాన్‌లోని బిట్స్‌పిలానీలో పూర్తి చేసింది. కీర్తిరెడ్డికి ర్యాంకు రావడంపై బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సర్కారు బడుల సత్తా

- పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ
- 595 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచిన మేఘన
- గత ఏడాది 85.89 శాతం, ఈ ఏడు 77.61 శాతం
- ఫలితాలలో అన్నమయ్యకు 20వ స్థానం



ఆర్.మేఘన (595)



ఆర్.ఫీనిహాస్ (590)



రాయచోటి: పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. వీరబల్లి మండలం, పెద్దివీడు రెడ్డివారిపల్లి జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న ఆర్ మేఘన 595 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకుంది. రాజంపేట రూరల్ మండలం, బోయనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఆర్ ఫీనిహాస్ 590 మార్కులు సాధించాడు. జిల్లాలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 500 మార్కులు పైబడి సాధించి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తమ పట్టును నిలుపుకున్నారు. 22 కేజీబీవీ పాఠశాలల్లో 798 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 631 మంది విద్యార్థులు పాసై 79 శాతం ఉత్తీర్ణతను సాధించారు. ఈ పాఠశాలలో 550 పైబడి సాధించిన విద్యార్థులు 17 మంది పైగా ఉండటం విశేషం.

ఉత్తీర్ణత శాతం గణాంకాలు :
ఈ సంవత్సరం పదోతరగతి ఫలితాల్లో మొత్తం ఉత్తీర్ణత శాతం 77.61గా నమోదైంది. గత ఏడాది అన్నమయ్య జిల్లాలో 85.89 శాతంగా నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం తగ్గినా ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెరిగిందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

40 పాఠశాలల్లో వందశాతం



జిల్లాలో 484 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 40 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. పరీక్షల ఉత్తీర్ణతలో పాఠశాలల ప్రమాణాలను ఉపాధ్యాయుల తపనను ప్రతిబింబిస్తోంది. రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా 77.61 శాతం ఉత్తీర్ణతతో 20వ స్థానాన్ని దక్కించుకుంది. పరీక్షలకు మొత్తం 21755 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 16884 మంది పాసైనట్లు జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జ్ శివప్రసాద్ రెడ్డి తెలిపారు. బాలికలు 10880 మంది విద్యార్థునులకు గాను 8917 మంది ఉత్తీర్ణత సాధించారు. 81.96 శాతం ఉత్తీర్ణత సాధించగా బాలురలో 10875 మంది పరీక్షలు రాయగా 7967 మంది పాసై 73.26 శాతం ఉత్తీర్ణతగా నిలిచారు.

- మదనపల్లిలో వివేకానంద మున్సిపల్ పాఠశాలలో ధనుశ్రీకి 591, పీలేరు మహాత్మా జ్యోతి రావుపూలే గురుకుల పాఠశాలలో అక్షయ్‌కు 590, నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తురక మనిదీప్‌కు 589, రాయవరం జెడ్పీ పాఠశాలలో షేక్ ఆసియాకు 588, సంబేపల్లి మండలం ఆదర్శ పాఠశాలలో ఎస్ జాఫర్ వలి 584, సంబేపల్లి జడ్పీ హైస్కూల్‌లో సయ్యద్ రుక్షాన 577 మార్కులతో పాటు 500 పైబడిన మార్కులు అధిక మంది సాధించారు. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో ఇద్దరు విద్యార్థులు 598 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. జిల్లాలో పుల్లంపేట మండల పరిధిలోని శివపార్వతీ హైస్కూల్‌లో ఇద్దరు విద్యార్థులు, బి. కొత్తపేటలోని సరస్వతీ స్కూల్‌లో ఒక విద్యార్థి పరీక్షలకు హాజరుకాగా రెండు పాఠశాలల్లో ముగ్గురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధన లేకుండా జీరో శాతంగా నిలిచాయి.

నిరుపేద ఇంట విద్యా కుసుమం



తల్లిదండ్రులతో మాధవి

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రానికి చెందిన వన్ను రామాంజనేయులు, పుష్పావతి దంపతులకు నలుగురు కుమార్తెల సంతానం. వీరికి ఎలాంటి ఆస్తి పాస్తులు లేవు. దినసరి కూలి పనులే వీరి జీవనాధారం. వీరి పెద్ద కుమార్తె మాధవి స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్లో చదివింది. బుధవారం వెలువడిన పది ఫలితాల్లో 574 మార్కులు సాధించి మండలంలోనే మొదటి స్థానం సాధించింది. సదరు బాలికను ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్, హెచ్‌ఎం అపర్ణాదేవి అభినందించారు.

ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి సూచనలే కీలకం

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: ఎన్నికల ప్రకియను బలోపేతం చేయడానికి రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు కీలకమని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలో ఓటర్ల సవరణ-2025 పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, వివిధ రకాల ఫారములు తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా డీఆర్‌ఓ మధుసూదనరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో గత సమావేశంలో చర్చించిన వివిధ విషయాలు, సంబంధిత చర్యలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు క్లుప్తంగా వివరించారు. ఓటర్ల సవరణ, బీఎల్‌ఓలు, వివిధ రకాల ఫారములు తదితర అంశాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పులు కావాలి అనుకుంటే దానికి ఎన్నికల సంఘం వారు అవకాశం ఇస్తారని తెలిపారు. ఈవీఎంల గోడౌన్ సందర్శనను రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగే సమావేశం రోజునే జరిగితే బాగుంటుందని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. సమావేశం అనంతరం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు డీఆర్‌ఓతో కలిసి ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను సందర్శించారు. సమావేశంలో కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరిటెండెంట్ రెడ్డప్ప రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నా పేరు కడియాల జయరామయ్య, వైకోట గ్రామం, ఓబులవారిపల్లి మండలం, అన్నమయ్య జిల్లా. నేను 3.50 ఎకరాలు అరటి సాగు చేసాను. పంట చేతికి వచ్చే సమయంలో వర్షం, ఈదురుగాలులతో పంట అంతా నేల వాలింది. ఒక అరటిగెల కూడా పనికి రాకుండా పోయింది. ఎకరాకు సుమారు రూ.50 వేల వరకు ఖర్చు చేసాను. పెట్టుబడి కూడా రాకుండా పోయింది.



నా పేరు సిద్ధక నాగిరెడ్డి. నాది కస్తూరిరాజుగారిపల్లె గ్రామం, సిద్ధకవాండ్లపల్లె, లక్కిరెడ్డిపల్లె మండలం, అన్నమయ్య జిల్లా. నాకు నాలుగు ఎకరాల మామిడి తోట ఉంది. నాలుగు రోజుల క్రితం ఈదురుగాలు బీభత్సానికి చేతికి అందిన మామిడి కాయలు కాస్త నేల రాలిపోయాయి. ఇప్పటికే రెండు లక్షలకు పైబడి ఖర్చు పెట్టాను. ప్రతి ఏడాది ఏప్రిల్, మే మాసంలో పంట చేతికి అందే సమయంలో ఈదురు గాలులు మామిడి రైతులను నట్టేట ముంచేస్తున్నాయి.

ప్రకృతి ప్రకోపం

- తల్లడిల్లిపోతున్న పండ్ల తోటల రైతులు
- మండు వేసవిలో పెనుగాలుల ప్రభావం
- రైల్వేకోడూరు, రామాపురం, రాజంపేట, లక్కిరెడ్డిపల్లె ప్రాంతాల్లో మామిడికి భారీ నష్టం



రైల్వేకోడూరు నియోజకవర్గం అనంతరాజుపేటలో నేలివాలిన అరటి

సాక్షి రాయచోటి: ఆరుగాలం శ్రమించి...అష్టకష్టాలు పడిన అన్నదాతకు చివరకు నిరాశే మిగులుతోంది. ఎప్పుడు చూసినా ఏదో ఒక రూపంలో పంట దెబ్బతినడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతిసారి ప్రకృతి పండ్ల తోటల రైతులను దెబ్బతీస్తూనే ఉంది. మండు వేసవిలో పెనుగాలులు, వడగండ్ల ప్రభావం ఏమిటో వాతావరణ నిపుణులకు సైతం అంతుచిక్కడం లేదు. పంట నోటికాడికి వచ్చి నేడో, రేపో చేతికందేలోపు ప్రకృతి దెబ్బకు కూలిపోతోంది. వాతావరణ మార్పుల ప్రభావంతో రైతన్నలకు మాత్రం వ్యవసాయంలో నష్టాలు చవి చూడాల్సి వస్తోంది. గత వారం, పది రోజులుగా జిల్లాలో పెనుగాలులు, వడగండ్ల ప్రభావానికి పండ్ల తోటల రైతులు తీవ్రంగా నష్టపోయారు.

అరటిపై 'పెను' ప్రభావం
అన్నమయ్య జిల్లాలో పెనుగాలుల ప్రభావం అరటి పంటపై పడింది. గెలలతో ఉన్న అరటి పంట గాలుల ధాటికి నిలువునా నేలకొరిగింది. ప్రధానంగా రైల్వేకోడూరు నియోజకవర్గంతోపాటు రాజంపేట ప్రాంతంలో అరటి రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఆ రెండు నియోజకవర్గాల్లో సుమారు 400 ఎకరాల్లో అరటి పంట దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కారణంగా పెద్ద ఎత్తున నష్టం కలిగింది. ఎప్పుడూ కూడా ఇలా వేసవిలో గాలుల ప్రభావం లేదని, ఈ విచిత్రమైన పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని రైతులు అంటున్నారు.

మామిడి రైతులకు కోలుకోలేని దెబ్బ
అన్నమయ్య జిల్లాలో మామిడి రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. గాలులతోపాటు వడగండ్ల వర్షానికి లక్కిరెడ్డిపల్లె మండలంలోని కుర్నూతల, రామాపురం మండలం రాచపల్లె, గువ్వలచెరువు, సుగాలితాండాతోపాటు పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలలో వేలాది ఎకరాల్లో మామిడి కాయలు గాలులకు నేల రాలాయి. ఈ సీజన్‌లో పూత రాక కొందరు, కాయలు కాయక మరికొందరు ఇలా అల్లాడుతున్న తరుణంలో గోరుచుట్టుపై రోకలిపోటులా అన్నో ఇన్నో కాసిన కాయలు గాలుల ప్రభావంతో రాలిపోయాయి.

150 హెక్టార్లలో అరటి నష్టం



అరటి రైతులకు సంబంధించి ఇటీవల ఒకటి, రెండు విడతల్లో పెనుగాలులతోపాటు వడగండ్ల వాన దెబ్బతీసింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 150 హెక్టార్లకుపైగా రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో అరటి పంట దెబ్బతింది.

– రవిచంద్రబాబు, జిల్లా ఉద్యానశాఖ అధికారి

గతంలో ఒకలా.... ప్రస్తుతం మరోలా...

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలోని వైఎస్ జగన్ సర్కార్ రైతులకు సంబంధించి పెద్ద పీట వేసేవారు. మొదట్లోనే పెట్టుబడి సాయం మొదలు కొని ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పావలా వడ్డీ రుణాలు ఇలా అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకునేది. అంతేకాకుండా ఇలాంటి ప్రకృతి విపత్తులు ఏర్పడినపుడు ఆగమేఘాలపై నష్టనివారణకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టేవారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రైతులకు సంబంధించి ఉచిత పంటల బీమా లేకపోగా, రైతు భరోసాపై కూడా నీలినీడలు అలుముకున్నాయి. మరోవైపు ప్రకృతి విపత్తుతో రైతులు పండ్ల తోటల్లో తీవ్ర నష్టం ఎదుర్కొంటున్నా వారికి భరోసా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపినా అసలు వస్తాయో, రావో అన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది.

క్లుప్తంగా

ఉపాధ్యాయులు ధ్రువపత్రాలు పొందాలి

రాయచోటి టౌన్ : దివ్యాంగ అర్హత కలిగిన ఉపాధ్యాయులు కడప రిమ్స్ ఆస్పత్రిలో జరిగే మెడికల్ క్యాంప్‌లో తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు సమర్పించి నూతన ధ్రువపత్రాన్ని పొందాలని కడప విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్. షంషుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఉపాధ్యాయుల బదిలీలను దృష్టిలో ఉంచుకొని ఈనెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. తమ ధ్రువపత్రాలు పరిశీలించుకోని వారిని అనర్హులుగా పరిగణిస్తామన్నారు.

జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయం ప్రారంభం

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రంగా జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని బుధవారం రాయచోటి పట్టణంలోని మాసాపేటలో ప్రారంభించారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి మధుసూదన్ మాట్లాడుతూ ఆరు నియోజక వర్గాలకు చెందిన కార్యకలాపాలు ఇక్కడి నుంచే కొనసాగుతాయని చెప్పారు. కాగా గతంలో ఎక్సైజ్ శాఖ భవనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించిన విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారులతో మాట్లాడి ఆ స్థలంలో సొంత భవనాల నిర్మాణాలకు కృషి చేస్తానని చెప్పారు.

పట్టపగలు చోరీ



బీరువాను పరిశీలిస్తున్న సీఐ

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవరాజపురం గ్రామం కాపుపల్లిలో గిద్దలూరు సుబ్రమణ్యం, నాగమణిల ఇంట్లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు పది లక్షల రూపాయలు విలువ చేసే బంగారు, రూ.10 వేలు నగదు చోరీ చేశారు. గిద్దలూరు సుబ్రమణ్యం, నాగమణి దంపతులు కూలిపనులు చేసుకొని జీవనం సాగిస్తారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంటి చెక్కవాకిలి, బీరువా పగుల కొట్టి లోపల ఉన్న బంగారు నగలు, వెండి గొలుసులు, రూ10 వేలు నగదు దోచుకెళ్లారు. సీఐ హేమసుందర్‌రావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చిరుత మృతి కేసులో సమగ్ర దర్యాప్తు

- కుట్ర కోణంపై ఆరా
- జంతువులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వండి
- పశువులు, పంట కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం
- మదనపల్లె సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఫారెస్ట్ సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసులు

మదనపల్లె : మదనపల్లె మండలం పొన్నుటిపాలెం అటవీ ప్రాంతం సరిహద్దులో వేటగాళ్లు పన్నిన ఉచ్చులో చిక్కుకొని చిరుత మృతి చెందిన కేసులో సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు మదనపల్లె సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక అటవీ కార్యాలయం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. చిరుత మృతి అనంతరం చోటు చేసుకున్న అంశాలు, అధికారులు చేపట్టిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కారణాలు ఏవైనా చిరుత మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనలో కేసు నమోదు చేసి ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని, అనేక కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నామన్నారు. కేసు దర్యాప్తు దశలో ఉన్న కారణంగా పూర్తి వివరాలు వెల్లడించలేకపోతున్నామన్నారు. అయితే ఈ సంఘటనలో కుట్ర కోణం ఏమైనా ఉందా అని ఆరా తీస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ ఘటనలో ఇతరుల ప్రమేయం, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సమీపంలో ఉండడంతో వ్యాపారస్తులు ట్రేడింగ్ ఏమైనా చేశారా ? వంటి అనేక కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నప్పుడు ప్రజలందరూ సహకరించి అటవీ అధికారులు తమ విధులు నిర్వహించేందుకు సహకరించాలన్నారు. అటవీ జంతువుల వల్ల ఎవరైనా పశువులు, పంటలు నష్టపోతే వెంటనే సంబంధిత అధికారుల ద్వారా ధ్రువపత్రాలు సమర్పిస్తే, బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పర్యావరణం, అడవులు, అటవీ జంతువుల సంరక్షణ సామాజిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఆ దిశగా కృషి చేయాలన్నారు. ఎక్కడైనా అటవీ జంతువులు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు.

ఈనెల 16న పొన్నుటిపాలెం వద్ద చిరుత ఉచ్చులో చిక్కుకుని మృతి చెందిన అనంతరం అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలతో యాంటీ స్నేర్ డ్రైవ్ మదనపల్లి డివిజన్‌లోనే కాకుండా జిల్లాలోని ఎనిమిది ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలో నిర్వహించామన్నారు. ఈ డ్రైవ్‌లో ఎక్కడా ఉచ్చులు, వలలు, వేటకు సంబంధించిన సామగ్రి లభించలేదన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జయప్రసాదరావు, డీఆర్ఓ మదన్‌మోహన్ రావు, సెక్షన్ అధికారులు సుధాకర్, శివకుమార్, షబిన్ తాజ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం, హత్య కేసులో జీవిత ఖైదు



ముద్దాయి నరసింహులు

సిద్దవటం : సిద్దవటం పోలీసు స్టేషన్ పరిధిలో 2022 సంవత్సరంలో జరిగిన అత్యాచారం, హత్య కేసులో ముద్దాయి నరసింహులు అలియాస్ బూపడుకు జీవిత ఖైదు, రూ. 1 లక్ష జరిమానా విధిస్తూ కడప 7వ ఏడీజే కోర్టు జడ్జి జి.ఎస్. రమేష్‌కుమార్ తీర్పు వెలువరించినట్లు సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కడప నగర సమీపంలోని చలమారెడ్డి గ్రామం సాయినగర్‌కు చెందిన కిన్నెర ఉమామహేశ్వరి(45) అనే మహిళ మాచుపల్లె గ్రామంలోని రేణుకా యల్లమాంబ గుడి ముందు పడుకుని ఉందన్నారు. పెండ్లిమర్రి మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన నరసింహులు అలియాస్ బూపడు పట్టుడు కట్టెతో బలంగా ఆమె తలపై కొట్టాడన్నారు. తీవ్రంగా గాయపడిన ఆమెపై అత్యాచారం చేయడంతో ఆమె మృతి చెందిందన్నారు. మృతురాలి అన్న ఫిర్యాదు మేరకు అప్పటి ఒంటిమిట్ట సీఐ రాజాప్రభాకర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారన్నారు. ఈ కేసు బుధవారం కడప 7వ ఏడీజే కోర్టు జడ్జి జి.ఎస్ రమేష్‌కుమార్ ముందుకు విచారణకు వచ్చిందన్నారు. తాము సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరిచామన్నారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. యాస్మిన్ వాదోప వాదనలు వినిపించి నేరస్తునికి శిక్ష పడేవిధంగా కృషి చేశారన్నారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి సెక్షన్ 235(2) సీఆర్‌పీసీ మేరకు జీవిత ఖైదు , రూ. 1 లక్ష జరిమానా విధించారన్నారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువు చేసి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని కడప జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ అభినందించినట్లు ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఏడుగురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో పలు కారణాలతో ఏడుగురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని మాలేపాడు పంచాయతీ ఆవులపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ భార్య చైత్ర (25) భర్తతో గొడవపడి పురుగుల మందు తాగింది. కురబలకోట మండలం బీసీ కాలనీకి చెందిన కేశవ భార్య సునీత (21) కుటుంబ సమస్యలతో పురుగుల మందు తాగింది. ఎగువపల్లె గ్రామానికి చెందిన చంద్ర కుమారుడు గిరి (20) తల్లిదండ్రులు మందలించారని పెయింట్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ములకలచెరువు మండలం చౌడసముద్రం గ్రామానికి చెందిన బాబా(34) పెయింటర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం కుటుంబ సమస్యల కారణంగా భార్య సల్మా(30)తో గొడవ పడ్డాడు. మనస్థాపం చెంది ఆమె మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించగా, ఆమె భర్త బాబా కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

పరీక్షలో ఫెయిల్ అయినందుకు..

ఇంటర్ పరీక్షల్లో మూడు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో రామసముద్రం మండలం బురుజుపల్లెకు చెందిన క్రిష్ణప్ప కుమార్తె ఇందు (18) మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. కురబలకోట బీసీ కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థిని (16) పరీక్షల్లో మ్యాథ్స్ సబ్జెక్టులో ఫెయిల్ అయినందుకు మనస్థాపం చెంది ఆత్మహత్యకు యత్నించింది. ఆయా సంఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

న్యాయవాది ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న చిన్నచౌక్ సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓంశాంతినగర్ రోడ్ నంబర్ 20లో నివాసం ఉంటున్న నీలిమ అనే న్యాయవాది ఇంటిలో దొంగలు బంగారు ఆభరణాలను దోచుకుని వెళ్లారు. న్యాయవాది గతనెల 21న తన పుట్టింటికి వెళ్లారు. ఈనెల 22వ తేదీన రాత్రి తమ ఇంటికి రాగానే వాకిలి తెరిచి ఉండటం, బీరువాలను పగులగొట్టి బంగారు ఆభరణాలను దోచుకుని వెళ్లారు. సంఘటన స్థలాన్ని మంగళవారం రాత్రి చిన్నచౌక్ సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. పోలీసులు తమ విచారణలో 9 తులాల బంగారు ఆభరణాలు దోచుకుని వెళ్లినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా న్యాయవాది నీలిమ తమ ఇంటిలో సుమారు 1000 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకుని వెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

అగ్నివీర్ వాయు నియామకం కోసం దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్ : ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయిగ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రిక్రూటింగ్ ఆఫీసర్, సికింద్రాబాద్ వారు అగ్నివీర్ వాయు నియామకాల ర్యాలీ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారని తెలిపారు. మే 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని భైరవ గుట్ట దగ్గర ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వెంకటరమణ అనే వ్యక్తి నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూ వివాదంలో ముగ్గురిపై కేసు నమోదు

సుండుపల్లె : భూ వివాదంలో ముగ్గురు వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. రాయవరం గ్రామ పంచాయతీ పాతజంగంపల్లికి చెందిన కిషోర్ కుమార్ ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన చిన్నపీరయ్య, ప్రభావతమ్మ, గంగోజమ్మ అనే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు.

వీఆర్‌ఓపై దాడి చేసిన వారిని శిక్షించాలి

రాయచోటి టౌన్ : గాలివీడు మండలంలో వీఆర్‌ఓ జయన్నపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వీఆర్‌ఓల సంఘం మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంవీ హేమ నాథరెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

వీఆర్‌ఓపై దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

గాలివీడు : పందికుంట వీఆర్‌ఓ జయన్నపై దాడి చేసిన ఘటనలో తండ్రి కొడుకులు కానాల రామచంద్రరెడ్డి, కానాల హేమసుందర్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వీఆర్‌ఓ విధి నిర్వహణలో ఉండగా నిబంధనలకు విరుద్ధంగా తమకు అనుకూలంగా పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయలేదన్న అక్కసుతో వారు దాడి చేశారన్నారు.

పరీక్ష తప్పానని విద్యార్థి ఆత్మహత్య



చల్లా విష్ణు (ఫైల్)

గుర్రంకొండ : పదవ తరగతి ఫెయిల్ కావడంతో మనస్థాపం చెంది చల్లా విష్ణు(15) అనే విద్యార్థి ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మండలంలోని మర్రిపాడులో జరిగింది. మర్రిపాడు గ్రామంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సి. మోహన్ కుమారుడు చల్లా విష్ణు స్థానిక జెడ్పీ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. తండ్రి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి కూలి పనులు చేసుకొంటూ పిల్లలను చదివించుకొంటోంది. బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో విష్ణు ఫెయిల్ అయ్యాడు. తోటి స్నేహితులు అందరూ ఉత్తీర్ణులైన ఆనందంలో ఉండగా తాను మనస్థాపానికి గురయ్యాడు. బుధవారం తండ్రి ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్లిపోగా తల్లి కూలి పనులకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష్ణు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జరిగిన సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంజలి

రాయచోటి టౌన్ : రాయచోటి - సుండుపల్లె రోడ్డులోని కస్తూర్బా గురుకుల పాఠశాల వద్ద బైకు ఢీకొన్న ఘటనలో అదే పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న అంజలి తీవ్రంగా గాయపడింది. బుధవారం రోడ్డు దాటుకొని వస్తుండగా సుండుపల్లె రోడ్డు వైపు వెళుతున్న బైకు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ సంఘటనలో విద్యార్థి తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రిన్సిపల్ శశికళ విద్యార్థిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కడపకు తీసుకెళ్లారు. అనేక సార్లు ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మూలపల్లెలో చిరుతల సంచారం



సిద్దవటం మండలం మాలపల్లె గ్రామ శివారులో సంచరిస్తున్న చిరుత పులి

సిద్దవటం : మండలంలోని మూలపల్లె గ్రామ సమీపంలో చిరుత పులులు సంచరిస్తుండటంతో గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కడప రేంజి పరిధిలోని కనుమలోపల్లె బీటులో చిరుత పులి, చిరుత కూనలు సంచరిస్తుండటంతో గ్రామ ప్రజలు, చుట్టు పక్కల పొలాల రైతులకు కంటినిండా నిద్ర లేకుండా పోయింది. కొన్ని రోజుల క్రితం గ్రామానికి చెందిన రాజశేఖర్‌యాదవ్ అనే వ్యక్తి తన మేక కనిపించకపోవడంతో గాలింపు చేపట్టగా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుత దాడిలో మేక మృతి చెందినట్లు గ్రామస్తులు గుర్తించారు. మంగళవారం రాత్రి చిరుత పులి, రెండు చిరుత కూనలు మూలపల్లె- సిద్దవటం రోడ్డులో సంచరిస్తూ గ్రామ సమీపంలోని పొట్టేటి పద్మావతమ్మ మామిడి తోటలోకి వెళుతుండగా మాచుపల్లె నుంచి బొలెరోలో వస్తున్న హెచ్‌పీసీఎల్ గ్యాస్ కంపెనీ లైన్ వాకర్లు బి. యల్లయ్య, విష్ణులకు కనిపించాయి. దీంతో వారు మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించారు. విషయం తెలుసుకున్న కడప రేంజర్ ప్రసాద్ సిబ్బందితో కలిసి చిరుత పాద ముద్రలను గుర్తించేందుకు చిరుత పులి సంచరించిన ప్రాంతాల్లో పరిశీంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రాత్రి వేళ జాగ్రతగా ఉండాలన్నారు. చిరుత సంచారంపై గ్రామంలో చాటింపు వేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ద్విచక్ర వాహనాలలో వెళ్లే వాహనదారులు రాత్రి వేళల్లో జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు.

ఫారెస్టు అధికారులకు దుప్పి అప్పగింత



ఫారెస్టు అధికారులకు దుప్పిని అప్పగిస్తున్న గ్రామస్తులు

పుల్లంపేట : పుల్లంపేట మండలం, దొండ్లపల్లి గ్రామంలో బుధవారం కుక్కలు తరుముకోవడంతో దుప్పి గ్రామంలోకి ప్రవేశించింది. విషయాన్ని గమనించిన గ్రామస్తులు సర్పంచ్ మణి ఆధ్వర్యంలో దుప్పిని ఫారెస్టు అధికారులకు క్షేమంగా అప్పజెప్పారు. దీంతో ఫారెస్టు అధికారులు సర్పంచ్‌ను, గ్రామస్తులను అభినందించారు. ఫారెస్టు అధికారి శేఖర్ మాట్లాడుతూ వన్య ప్రాణులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వన్య ప్రాణాలను వేటాడటం చట్టరీత్యా నేరమన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని చంద్రకాలనీకి చెందిన మునిరాజ (40) అతని భార్య సులోచన (36), కుమార్తె హితశ్రీ (6) కుమారుడు జయవర్ధన్ (4) కలిసి ద్విచక్రవాహనంలో చిత్తూరు జిల్లా సోమల మండలం కందూరుకు వెళ్లారు. తిరిగి బుధవారం ఇంటికి వస్తుండగా తాము నివాసమున్న ప్రాంత సమీపంలోని మదనపల్లె బైపాస్‌రోడ్డులో వాహనం అదుపు తప్పి గాయపడ్డారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా దామచెర్లకు చెందిన బిక్షం కుమారుడు కోటేశ్ (35) మదనపల్లె మండలంలోని జెర్సీ డెయిరీ సమీపంలో భవన నిర్మాణ మేస్త్రీగా పని చేస్తున్నాడు. బుధవారం కూరగాయలు తీసుకుని నడిచి వెళుతుండగా జెర్సీ డెయిరీ సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

సైన్స్ ఒలంపియాడ్‌లో భారతి డీఏవీ విద్యార్థుల ప్రతిభ

కమలాపురం : సిల్వర్ జోన్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ పోటీల్లో డీఏవీ భారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) భారతి డీఏవీ పాఠశాలలో బుధవారం సిల్వర్ జోన్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో జోనల్ స్థాయిలో 41 మంది బంగారు పతకాలు సాధించారు. అలాగే 6 మంది రజత పతకం, 8 మంది వెండి పతకాలు సాధించారని ఆయన తెలిపారు. కాగా హెచ్‌ఆర్ హెడ్ గోపాల్ రెడ్డి, డీఏవీ రీజనల్ ఆఫీసర్ శేషాద్రి ఒలంపియాడ్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులందరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వయోజన విద్య నుంచి మినహాయించాలి



జేసీ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఏఓల సంఘం నేతలు

రాయచోటి అర్బన్ : వయోజనవిద్య నుంచి వెంటనే వీఓఏలను మినహాయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణంలో వెలుగు వీఓఏల సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పనిభారంతో అల్లాడుతున్న వీఓఏలపై వయోజనవిద్య భారాన్ని మోపడం దారుణమన్నారు. వీఓఏల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాణెమ్మ, రెడ్డెప్పలు మాట్లాడుతూ లబ్ధిదారులకు ఎఫ్ఆర్ఎస్ చేయడం కష్టమన్నారు. ఈ మేరకు వారు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నేతలు సుబ్రమణ్యం, రెడ్డెప్పరెడ్డి, రమణారెడ్డి, కృష్ణమ్మ, ఆనంద్, శివశంకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి పిరికిపంద చర్య



రాయచోటిలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



రామసముద్రం: ఉగ్రవాదుల దిష్టి బొమ్మను తగలబెడుతున్న బీజేపీ నేతలు

రాయచోటి అర్బన్ : జమ్మూకశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడి పిరికిపంద చర్య అని వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండిపడ్డారు. ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా బుధవారం సాయంత్రం రాయచోటి పట్టణంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు చిల్లీస్ ఫయాజ్‌బాషా, ఫయాజుర్ రహిమాన్, కౌన్సిలర్లు కొలిమి చాన్‌బాషా, ఈశ్వర్ ప్రసాద్, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఫయాజ్ అహమ్మద్, అబూజర్, సుగవాసి శ్యామ్‌కుమార్, మురికినాటి వెంకట్రామిరెడ్డి, విజయభాస్కర్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించాలి

రాయచోటి టౌన్ : ఉగ్ర దాడి హేయమైన చర్య అని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ సమగ్రతను విచ్ఛిన్నం చేసేందుకు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దేశమంతా ఒక్కటై ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించాలని పిలుపునిచ్చారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దగ్ధం

రామసముద్రం : జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో సుమారు 30 మంది పర్యాటకులు మృతి చెందిన ఘటనకు నిరసనగా బుధవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఇలాంటి ఘటనలతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని, దేశం మొత్తం ఏకతాటిపైకి వచ్చి ఉగ్ర మూకలను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండి ఆనంద్, జర్మన్ రాజు, కృష్ణమూర్తి, ఆనంద్‌నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, నవీన్, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద దాడి అత్యంత హేయమైన చర్య

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి జగదాంబసెంటర్ : జమ్మూ కశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి అత్యంత హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ సమగ్రతను విచ్ఛిన్నం చేసేందుకు కొంత మంది విచ్ఛిన్నకారులు, ఉగ్రవాదులు ప్రయత్నం చేస్తున్నారని, దేశమంతా ఒక్కటై ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించాలన్నారు. అమాయక పౌరులపై, ముఖ్యంగా పర్యాటకులపై దాడి చేయడం క్షమించరాని నేరమన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అండగా నిలవాలని, గాయపడిన వారు వేగంగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.